క్లుప్తంగా

నేడు కంటి వైద్యశిబిరం

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామంలో శుక్రవారం మండలంలోని పంచాయతీ కార్యాలయంలో కారంచేడు ఎల్‌వీ ప్రసాద్ కంటివైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. కంటి మసకలు, చుక్కలు, పొరలుంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

యద్దనపూడి: బీసీ కార్పొరేషన్ రుణాలకు ఫిబ్రవరి 7 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, రెడ్డి, కాపు, స్వయం సహాయక స్కీంలకు సంబంధించి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం స్థానిక సచివాలయాల్లో కానీ, ఎంపీడీఓ కార్యాలయంలో కానీ సంప్రదించాలన్నారు.

మున్సిపల్ సమావేశం నేడు

అద్దంకి రూరల్: స్థానిక కౌన్సిల్ హాలులో శుక్రవారం ఉదయం 11 గంటలకు సాధారణ సమావేశం నిర్వహించనున్నారు. ఈమేరకు చైర్మన్ ఎల్. ఎస్తేరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అక్షరాస్యతతో దేశ ప్రగతి


మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూప రాణి

జె. పంగులూరు: అక్షరాస్యత దేశానికి ప్రగతిని, అక్షరాస్యత సాధించిన ఏ దేశమూనా అభివృద్ధి చెందుతుందని పంగులూరు ఎంపీడీఓ స్వరూపరాణి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమం భాగంగా జరిగిన వయోజన విద్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 18 సంవత్సరాల నుంచి 60 మధ్యలో ఉన్న మహిళలు తప్పకుండా వయోజన విద్య నేర్చుకోవాలన్నారు. ఎంఈఓ జి. విరాంజనేయులు మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యత ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. వయోజన విద్య సూపర్వైజర్ జ్యోతి, ఏపీఎం జ్యోతి ప్రసాద్ వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలి


మాట్లాడుతున్న సీడీపీఓ సుజాత

యద్దనపూడి: తల్లిదండ్రులు విధిగా పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. మండలంలోని జాగర్లమూడి అంగన్‌వాడీ కేంద్రంలో గన్నవరం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందితో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన 21 రోజుల్లోగా జనన ధ్రువీకరణ పత్రం పొంది ఆధార్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మూడు సంవత్సరాల నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచండి


బల్లికురవలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బల్లికురవ: గ్రామాల్లో వ్యర్థాలను ఎక్కడపడితే క్కడ పడివేయకుండా గ్రీన్ అంబాసిడర్‌ల రిక్షాల్లో వేయాలని ఎంపీడీవో కుసుమకుమారి కోరారు. గురువారం మాట్లాడుతూ చెత్తనుంచి సంపద కేంద్రాలు 7 పంచాయతీల్లో చేపట్టలేదన్నారు. మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ గిరి నాయక్, ఈఓఆర్డీ దాసరి సుమతి మాట్లాడారు.

సుజలం.. విఫలం

- చీరాల్లో కల్తీ నీటి వ్యాపారం
- జోరుగా రూ.10 వాటర్‌బాటిళ్ల అమ్మకాలు
- పుట్టగొడుగుల్లా అను'మతి'లేని వాటర్ ప్లాంట్లు
- ప్రజల ప్రాణాలతో చెలగాటం


అపరిశుభ్రంగా 20 లీటర్ల మినరల్ వాటర్ క్యాన్లు


కాసులు కురిపిస్తున్న రూ.10 వాటర్ బాటిళ్లు


ఇతర ప్రాంతాల్లో అమ్మకానికి తీసుకెళ్తున్న వాటర్ బాటిళ్ల కేసులు

చీరాల టౌన్:

ప్రస్తుతం మినిరల్ వాటర్ తాగడం ఓ ఫ్యాషన్‌గా మారిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. నీటి వసతి లేని ప్రాంతాల్లో తప్పదు అనుకున్నా.. చెరువులు, కాలువల నీటితో పాటు రక్షిత నీటి పథకాలున్న ప్రాంతాల్లో కూడా ఈ మినరల్ మాయలో పడి రోగాల పాలవుతున్నారు. పేరులోనే మినరల్ తప్ప నీటిలో ఉండవు. పేదల నుంచి ఉన్నత వర్గాల వరకు ఈ క్యాన్‌ల నీటినే తాగుతూ అదే ఆరోగ్యం అనే భ్రమలో బతుకుతున్నారు. ఇదే అక్రమార్కులకు లాభసాటి వ్యాపారంగా మారింది. పెద్దగా పెట్టుబడి లేకుండా తక్కువ రోజుల్లోనే లక్షలు గడిస్తుడంటంతో చాలామంది ఈ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. కనీస ప్రమాణాలు పాటించక పోవడంతో పాటు ఐ.ఎస్.ఐ అనుమతి ఏ ఒక్కరికి లేదు. ఇది కావాలంటే లక్షల్లో ఖర్చవుతుంది. దీనికి తోడు ప్రతినెలా ల్యాబ్‌లు, వాటర్ టెస్ట్‌ల వంటివి చేయించాల్సి ఉంటుంది. కెమిస్ట్, మైక్రోబయాలజీల టెస్ట్ పాసైన తర్వాతే నీటిని విక్రయించాల్సి ఉంటుంది. ఈ పరిశీలనే రెండురోజులు పడుతుంది. కానీ కొందరు రూపాయి ఖర్చుతో పది రూపాయలు సంపాదించాలని అత్యాశతో ఎటువంటి అనుమతి లేకుండానే అక్రమ వ్యాపారానికి తీరలేపారు.

జోరుగా రూ.10 వాటర్ బాటిళ్ల విక్రయాలు

చీరాల నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాల్లోని చిల్లరకొట్లు, బడ్డీబంకుల్లో సైతం రూ.10 వాటర్ పేరుతో దర్జాగా నీటి వ్యాపారం చేస్తున్నారు. చీరాల నియోజకవర్గంలో కేవలం రూ.10 వాటర్‌బాటిళ్ల విక్రయాలు రోజుకు లక్షల్లోనే జరుగుతున్నాయి. చీరాల నియోజకవర్గంలోని కొత్తపేట, పేరాల, ఈపురుపాలెం, బైపాస్ రోడ్డు సమీపంలో అధికంగా ఈ ప్లాంట్లు నడుస్తున్నాయి. వాటర్ క్యాన్లతో పాటు వివిధ రకాల ఆకర్షణీయమైన పేర్లతో రూ.10కే వాటర్ బాటిల్‌ను విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తు కోట్లు గడిస్తున్నారు.

ఎలాంటి శుద్ధి లేకుండానే..

చీరాల నియోజకవర్గంలోఉన్న ఒకటి రెండు మినహా మిగిలిన వాటర్ ప్లాంట్లలో ఎటువంటి ప్రాసెసింగ్ చేయకుండా నీటిని తయారు చేస్తున్నారు. మంచినీటి బోర్లు వేసి వాటిని ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా నింపి అవే నీటిని క్యాన్‌లలో పట్టి విక్రయిస్తున్నారు. ఫ్రిజ్‌లలో నీటిని పోయడం వలన చల్లగా ఉండటంతో అరలీటరు రూపాయి చొప్పున ప్రజలు కొనుగోలు చేసి తాగుతున్నారు. చీరాల నుంచే కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు, బాపట్ల ప్రాంతాలకు వాటర్ క్యాన్లు, రూ.10 వాటర్‌బాటిళ్ల టాటాఏస్, ఆటోలు, ఇతర వాహనాల్లో రవాణా చేస్తున్నారు. ఓ క్యాన్ నీటికి కేవలం రెండు రూపాయలు ఖర్చు అవుతుంది. వ్యాపారులు ఎటువంటి శుద్ధి చేయకుండా ఒక్కో క్యానుకు 15 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. వాటర్ క్యాన్లు ఎక్కువ సేపు నిల్వ ఉంటే బ్యాక్టీరియా చేరుతుంది. లేకుంటే ఫంగస్ కూడా పడుతుంది. వాటర్ క్యాన్‌ల మూతసైజు రెండు అంగుళాలు మాత్రమే ఉంటుంది. క్యాన్‌లను శుభ్రపరిచే అవకాశం ఉండదు.

ఆరోగ్యంపై దుష్ప్రభావం

ఎటువంటి టెస్ట్‌లు నిర్వహించకుండా మినరల్ వాటర్ పేరుతో విక్రయిస్తున్న నీటిని తాగితే హానికరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చీరాల ప్రాంతంలోని నీటిలో ఐరన్‌శాతం అధికంగా ఉంటుంది. పీహెచ్ శాతం కూడా తక్కువగా ఉంటుంది. వీటి ద్వారా వైరల్ జబ్బులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది. క్యాన్‌లలో వాటర్ నిల్వ ఉంటుంది వలన బ్యాక్టీరియా చేరి పలు అనారోగ్య సమస్యలను తెచ్చే ప్రమాదం ఉంది. అవి చనిపోవాలంటే క్లోరిన్, ఇతర ప్రక్రియ ద్వారా ప్రాసెస్ చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా వైరల్ ఫీవర్లు, గొంతునొప్పి, డయేరియా వంటి వ్యాధులు సోకే అవకాశం ఉంది.

> **నీటిని ల్యాబ్‌లకు పంపి పరీక్షలు చేయించాలి**
>
> మినరల్ వాటర్ ప్లాంట్లులో నీటి సాంద్రత, లవణాల శాతం తెలుసుకునేందుకు విధిగా పరీలు చేయించాలి. అయితే చాలామంది చేయించడం లేదు. వాటర్‌బాటిళ్ల అమ్మకాలపై ఫిర్యాదులు కూడా వచ్చాయి. శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌లకు పంపేందుకు చర్యలు తీసుకుంటాం.
>
> – ప్రణీత్‌కుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, చీరాల

శివదత్త క్షేత్రంలో ప్రత్యేక పూజలు


రాగసాగర కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీగణపతి సచ్చిదానంద స్వామిజీ

చీరాల అర్బన్: పట్టణంలోని స్వర్ణ రోడ్డులోని శివ దత్త క్షేత్రంలో మైసూరు అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి, శ్రీ దత్త విజయానంద స్వామిజీలు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిజీలకు పూర్ణకుంభంతో, వేదమంత్రాలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీచక్రపూజ, గణపతి హోమం, సరస్వతి రాగసాగర కార్యక్రమాలను నిర్వహించారు. స్వామిజీ మాట్లాడుతూ దత్తక్షేత్ర 2025 నవ్యాంధ్ర పర్యటనలో భాగంగా చీరాలకు వచ్చామన్నారు. అవధూత దత్త పీఠం ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు దేశ విదేశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

చీరాల టౌన్:

పంచాయతీల కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్ అర్జీలను విచారించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఇంటిపన్ను వసూళ్ల వేగవంతం చేసి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. ఈవోఆర్డీ రామకృష్ణ, ఏపీఎం మధు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లున్నారు.

క్రమశిక్షణతో ఉన్నత భవిత


రిటైర్డు లెక్చరర్లను సన్మానిస్తున్న దృశ్యం


విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

చీరాల అర్బన్: నేడు ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ప్రభుత్వ కళాశాలలో ప్రభుత్వం కల్పించే అన్ని సౌకర్యాలను వినియోగించుకొని రేపటి తరానికి ప్రతినిధులుగా ఎదగాలని డీఐఈఓ పి.యర్రయ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ 23వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.స్నేహలత అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో అన్ని రకాల వసతులున్నాయని, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి రావాలన్నారు. డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ ఎస్.మురళి, చీరాల ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, రిటైర్డు ప్రిన్సిపాల్ బత్తుల బ్రహ్మారెడ్డి, రిటైర్డు పీడీ కె.రాఘవరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు, గురువులు పట్ల భక్తి శ్రద్ధలతో మెలగాలని అన్నారు. రిటైర్డు లెక్చరర్లు జె.ఈశ్వరుడు, కె.రమేష్‌లను సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.స్నేహలత 2024-25 విద్యాసంవత్సరంలో కళాశాల సాధించిన ప్రగతిని వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

ఇంటర్ విద్య భవిష్యత్‌కు నాంది


మాట్లాడుతున్న ఎస్సై


బల్లికురవ కళాశాలలో డాన్స్‌లు వేస్తున్న బాలికలు

బల్లికురవ: ఇంటర్ విద్య భవిష్యత్‌కు, ప్రణాళికలకు నాంది వంటిదని బల్లికురవ ఎస్సై జీవీ చౌదరి అన్నారు. గురువారం బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల 24 వ వార్షికోత్సవాలు గురువారం ఉల్లాసంగా జరిగాయి. ఎస్సై మాట్లాడుతూ పరీక్షలకు నెలరోజులు మాత్రమే సమయం ఉన్నందున లక్ష్యంతో పాటు కష్టపడి.. ఇష్టపడి చదవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. సుధాకర్ మాట్లాడుతూ జూనియర్ కళాశాల రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిందని చెప్పారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కె. హనుమంతరావు, కేబీ వెంకటేశ్వరరావు, ఎంవీ ఫౌండేషన్ కోర్డినేటర్ హరిహరరెడ్డి మాట్లాడారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి


సర్వే పనులను పరిశీలిస్తున్న తహసీల్దారు రవికుమార్

యద్దనపూడి: గ్రామాల్లో చేస్తున్న రీసర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దారు రవికుమార్ అన్నారు. పూనూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వే జరుగుతున్న పొలాలకు వెళ్లి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ చేపల చెరువులు, ప్రభుత్వ భూములు, రైసు మిల్లులు గ్రామ సమీపంలోని ఇంటి స్థలాలు వంటి వాటిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. సర్వేజరిగే పొలాలకు సంబంధించిన రైతులకు ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. నిర్దేశించిన సమయానికి సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ విష్ణు, వీఆర్వో వసంతరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అంటరానితనం పాటిస్తే చర్యలు

- పౌరుల హక్కుల దినోత్సవంలో వక్తలు


మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ శివశ్రీను

జె.పంగులూరు: సమాజంలో మనుషులంతా ఒక్కటేనని, అందరికీ సమాన హక్కులున్నాయని, అంటరాని తనం నేరమని పంగులూరు డిప్యూటీ తహసీల్దార్ ఏ. శివ శ్రీను అన్నారు. పౌరుల హక్కుల దినోత్సవం సందర్భంగా పంగులూరులోని దళిత కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని, వారిని పనులకు పంపి వారి భవిష్యత్తు పాడు చేయవద్దని కోరారు. పిల్లలు చదువుకుంటే కుటుంబాలు బాగుపడతాయని అందరూ విజ్ఞాన వంతులు అవుతారన్నారు. ముప్పవరం ఎస్సీ బాలుర వసతీ గృహ అధికారి వీరాస్వామి మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సు మేరకు ప్రతి నెలా 30వ తేదీన ఎస్సీ, ఎస్టీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దేవాలయాల్లో దళితులకు ప్రవేశం లేకుండా చేసినా, హోటళ్ళలో రెండు గ్లాసుల పద్ధతులు పెట్టినా నేరమన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులను విచారించటానికి ప్రభుత్వమే పెట్టిన వాదిస్తుందని న్యాయం జరిగే వరకూ పేదల పక్షం నిలబడుతుందని తెలిపారు. వీఆర్వోలు చింపారావు, కోలా గ్రేస్, వెల్ఫేర్ అసిస్టెంట్ సంజీవరాణి, మహిళా కానిస్టేబుల్ గద్దె అరుణ, ఏఎన్ఎం ఎస్తేరు రాణి, సిబ్బంది శరత్, పీటర్ పాల్గొన్నారు.

వివాహ వేడుకలో కరణం


వివాహ వేడుకలో కరణం బలరాం, వైవీ భద్రారెడ్డి తదితర నాయకులు

మేదరమెట్ల:

కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ యర్రం రత్నారెడ్డి కుమార్తె వివాహ వేడుక మేదరమెట్లలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ శాసన సభ్యుడు కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఏఎంసీ మాజీచైర్మన్ వైవీ భద్రారెడ్డి, బత్తుల బ్రహ్మానందరెడ్డి, మేదరమెట్ల సర్పంచ్ బి. ఎలిశమ్మ , టీడీపీ నాయకులు మన్నె రామారావు తదితరులు పెండ్లికుమార్తె సహజను దీవించారు.

విజయవంతంగా కృత్రిమ గర్భధారణ


వైద్య శిబిరం పరిశీలిస్తున్న డాక్టర్ మాధవి

తిమిడెదపాడు (కారంచేడు): గత 30 సంవత్సరాలుగా పశువుల్లో కృత్రిమ పశు గర్భదారణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని పర్చూరు పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ మాధవి అన్నారు. గురువారం తిమిడెదపాడులో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని సందర్శించారు. అక్కడకు వచ్చిన పశు కాపరులు, పశు పోషకులతో ఆమె మాట్లాడారు. పశువులకు సీజనల్ వచ్చే వ్యాధుల నుంచి తప్పించుకోవడానికి అవసరమైన వ్యాధినిరోధక శక్తిని అందించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ పశువులకు నట్టల నివారణ మందును తప్పకుండా వేయించాలన్నారు. గేదెలు, గొర్రెలు, మేకలకు అవసరమైన డీ వార్మింగ్‌ను కూడా అందించామన్నారు. కారంచేడు, దగ్గుబాడు పశువైద్యాధికారులు డాక్టర్ భాగ్యరాజ్, డాక్టర్ రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి


బస్టాండ్ సెంటర్లో మార్కెట్ నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలు

చీరాల రూరల్: ప్రభుత్వం అందించే ఆర్థిక పరిపుష్టిని అందిపుచ్చుకుని స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని మెప్మా సీఎంఎం డొక్కా కొండయ్య అన్నారు. గురువారం స్థానిక బస్టాండ్ సెంటర్లో మెప్మా అర్బన్ మార్కెట్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయంగా తయారు చేసిన వివిధ రకాల వంటకాలను, ఉత్పత్తులను 60 స్టాల్స్ ద్వారా అమ్మకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంఎం కొండయ్య మాట్లాడారు. ప్రభుత్వ సహకారంతో ప్రతినెలా ఒకటి రెండు రోజులు పాటు బస్టాండ్ సెంటర్లో మెప్మా అర్బన్ బజార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒక్కరోజు పాటు నిర్వహించిన ఈ మార్కెట్‌లో లక్ష రూపాయలు అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలిపారు.

మహాత్మునికి ఘన నివాళి


చీరాల: గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు ,


వలపర్ల గ్రామంలో గాంధీజీ వర్ధంతి

చీరాల: జాతిపిత పూజ్య బాపూజీ వర్ధంతి చీరాల్లో నిర్వహించారు. మహాత్మా గాంధిజీ వర్ధంతి పురస్కరించుకుని చీరాల మున్సిపల్ కార్యాలయంలో మహాత్మా గాంధీజీ చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, మున్సిపల్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈస్వరాజ్యం కోసం తెల్లవారితో పోరాడి భారతదేశాన్ని దాస్యశృంఖలాల నుంచి విముక్తి చేయడానికి ఎంతో కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా గాంధిజీ అన్నారు. మున్సిపల్ డీఈ, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపాలిటీలోని పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు (చినగంజాం): జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా పర్చూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పి. బ్రహ్మయ్య ఆధ్వర్యంలో నివాళులర్పించారు. డీటీ సుధారాణి, ఎన్నికల డీటీ మాధవీలత, సర్వేయర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లులో..

తహసీల్దార్ ఎస్. వెంకటరత్నం గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల సర్వేయర్ లోకేష్,రీ సర్వే డీటీ భాగ్యరాజ్, ఏఎస్ఓ పుష్పలత, వీఆర్వోలు, వీఆర్ఏలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాంలో..

తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు నివాళులర్పించారు. డీటీ కె. సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: అహింస, సత్యాగ్రహం అనే ఆయుధాలతో స్వాతంత్ర సంగ్రామాన్ని ముందుకు నడిపించిన జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నేటి యువత నడవాలని చెన్నుపల్లి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ టి. వజ్రయ్య కోరారు. గురువారం చెన్నుపల్లి సచివాలయంలో గాంధీజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


చెన్నుపల్లి సచివాలయంలో గాంధీ వర్ధంతి వేడుకలు

మార్టూరు: మండలంలోని వలపర్ల గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నేతాజీ విద్యాసంస్థల ఆవరణలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, మలాది శ్రీనివాసరావు, చుండూరి మురళీ షుధాకరరావు, షేక్ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, గాడేపల్లి దివాకరదత్తు, ఉబ్బా దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, చామర్తి గురుశేఖర్, అంజాద్ బాషా, పసుపులేటి ఆంజనేయులు, నర్రా శ్రీలక్ష్మి, జాగర్లమూడి శివకుమారి, తమ్మన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అద్దంకి : గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు


ఇంకొల్లులో నివాళి అర్పిస్తున్న తహసీల్దార్